క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. దుర్గాభవానీనగర్, మాదన్నపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్సేంజ్, ఈస్ట్ మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఎల్‌బీనగర్: క్రీడలు దేహాదారుఢ్యానికి ఎంతో దోహదం చేస్తాయని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని వైదేహినగర్‌కాలనీకి చెందిన ప్రణీత్‌రెడ్డి ఇక్కడనే శిక్షణ పొంది టుడే లీగ్ మెగాసిటీ ట్రోఫీ, నితీష్ తివారి విశాఖ క్రికెట్ క్లబ్ జట్టుకు ఎంపికైన సందర్భంగా లచ్చిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొని విజయం సాధించాలనే ధీమాలో ఉండాలని కోరారు. ఆటల్లో గెలుపోటములు సహజమని రెండింటిని సమానంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాతబస్తీ బోనాలకు ఎంతో ప్రాధాన్యం



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గౌలిపురా కోట మైసమ్మ ఆలయంలోని అమ్మవారికి ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ఎస్.ఆనంద్‌రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో పాతబస్తీలో నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలు తెలంగాణలోనే వైభవంగా జరుగుతాయన్నారు.

మూడు వార్డుల్లో పాలన ఎప్పుడో?

13 వార్డుల్లో 10చోట్లే వార్డు కార్యాలయాల ఏర్పాటు



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ప్రారంభానికి నోచుకోని వార్డు పాలన

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో 13 వార్డులు ఉంటే ఇందులో 10 వార్డుల్లో వార్డు పాలన షురూ అయితే మరో మూడు వార్డుల్లో పాలన ఆలస్యమవుతోంది. కోర్టు కేసుల్లో ఉన్న భవనాల్లో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయడం వలన ఎల్‌బీనగర్ సర్కిల్-3లోని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో వార్డు పాలన ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ఇక సర్కిల్-5లో రెండు భవనాలు అందుబాటులోకి రాకపోవడం వల్ల గడ్డిఅన్నారం, చైతన్యపురి డివిజన్లలో వార్డు కార్యాలయాల ఏర్పాటు ఆలస్యమవుతోంది. దీంతో మూడు సర్కిళ్ల పరిధిలో 10 వార్డులలో మాత్రమే వార్డు కార్యాలయాలు ఏర్పాటు కాగా మరో మూడు వార్డులో ఇప్పటికీ ఆలస్య కావడం గమనార్హం! క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు తీసుకొచ్చిన వార్డు కార్యాలయాలకు ఆదిలోనే సమస్యలకు గుదిబండగా మారిందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సరైన భవనాలు లేకనే.....

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని మోడల్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయం కోర్టు కేసులో ఉంది. దీంతో స్థానికులు ఈ కార్యాలయ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఇక్కడ ప్రారంభానికి నోచుకోలేదు. ఇక సర్కిల్-5లో గడ్డిఅన్నారం, చైతన్యపురి డివిజన్లలో ఏర్పాటు చేయాల్సిన వార్డు కార్యాలయాలు ముందుగా నిర్ణయించిన సంక్షేమ సంఘాల భవనాలను కాలనీ వాసుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో అధికారులు మరో ప్రత్యామ్నయం కోసం చూస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించిన సంక్షేమ సంఘాల భవనాలపై అధికారులకు ఏమాత్రం పట్టులేకపోవడంతో ఆభవనాల వద్ద ఏర్పాటు చేయాల్సిన వార్డు కార్యాలయాలపై ఆయా సంక్షేమ సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించిన భవనాలను జీహెచ్‌ఎంసీ అవసరాలకు వాటికి సద్వినియోగం చేసుకోవాలంటే కాలనీ వాసులు భవనాలను అప్పగించడంలో విముఖత వ్యక్తం చేయడంతో అధికారులు ఏంచేయలేక పోతున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇతర భవనాలను చూసి పరుగు పరుగున వార్డు కార్యాలయాలను సిద్ధం చేసే పనిలో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది.

11 మంది అధికారులతో .....

వార్డు కార్యాలయాలను 11మంది అధికారులతో ఏర్పాటు చేశారు. ఇందులో వార్డు పాలన అధికారి, ఇంజనీరు, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, పారిశుద్ధ్యజవాను, కమ్యూనిటీ ఆర్గనైజర్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సూపర్‌వైజర్, వార్డు సహాయకుడు(జలమండలి), లైన్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షన్‌తో కలసి 11మంది వార్డు ఆధికారులు పనిచేయనున్నారు.

వారంలో ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నాం

సకాలంలో ప్రారంభానికి నోచుకోలేని వార్డు కార్యాలయాలు మరో వారం రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామని డీసీలు మారుతీదివాకర్, కృష్ణయ్యలు తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన భవనాం కోర్టు కేసులో ఉన్నప్పటికి స్థానికులతో మాట్లాడుతున్నామని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతోందని తెలిపారు. ఇక గడ్డిఅన్నారం, చైతన్యపురిలో వార్డు కార్యాలయాలకు నూతన భవనాలను ఎంపిక చేశామని పనులు జరుగుతున్నాయని పూర్తికాగానే వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తామని డీసీ కృష్ణయ్య తెలిపారు.

కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి:

ఎమ్మెల్యే బలాల



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. పంజేషాహలోని కార్యాలయంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై చర్చించారు. అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే సంపూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా అవసరమైన చోట్ల రోడ్లు, పార్కుల అభివృద్ధి, కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మెరుగైన సేవలు అందించడానికి ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో సర్కిల్-6 జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్ సింగ్, ఏఈలు వెంకన్న, రవికాంత్, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అభిషేక్ బల్లి

మలక్‌పేట: నడి వయసు దాటిన తర్వాత వచ్చే మోకాళ్లు, కీళ్ల నొప్పులకు తగిన చికిత్స అందుబాటులోకి వచ్చిందని శ్రీకర హాస్పిటల్ ప్రముఖ కీళ్ల, తుంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్ బల్లి అన్నారు. ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మూసారంబాగ్ డివిజన్ శ్రీపురంకాలనీలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన రోగులకు పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుమాధవ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉచిత శిబిరాలు నిర్వస్తామని, ప్రజలు ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి రామారావు, ఫౌండేషన్ కార్యదర్శి రవీంద్రరావు, సభ్యులు అశోక్, శ్యాంసుందర్, మహేష్, ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

లింగోజిగూడ: స్వచ్ఛంధ సంస్థలు అందిస్తున్న సహాయసహకారాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కర్మన్‌ఘాట్ లక్ష్మీ కన్వెన్షన్‌లో పదవ, ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన సుమారు 900మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయడంతో పాటు పలువురికి నగదు బహుమతులను అందజేశారు. వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ కాచం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోమ భరత్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్‌గుప్తా, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయం చైర్మన్ గుండా మల్లయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్-1 లో కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని కూరగాయల మార్కెట్‌లో కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలనీ పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ యిచ్చారు. మిగిలిపోయిన పనులను పూర్తి చేయిస్తానన్నారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి పాల్గొన్నారు.



ఇంద్రప్రస్థకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ మాయనిమచ్చ

నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ



సుభాష్‌చందర్జీని సన్మానిస్తున్న ఎంపీ భారతీబెన్ షియాల్

సైదాబాద్: అధికారాన్ని కాపాడుకోవటానికి దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తన హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ అన్నారు. ఆదివారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన యాంటీ ఎమర్జెన్సీ డే కార్యక్రమంలో ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయ్యి జైలు జీవితం గడిపిన సుభాష్‌చందర్జీని పార్టీ నాయకులు సన్మానించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ భారతీబెన్ షియాల్ బీజేపీ నాయకులు చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్, పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డిలతో కలిసి ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో ఎమర్జెన్సీని తలపించే పాలనకు గుణపాఠం చెప్పి రాష్ట్ర ప్రజలు బీజేపీకి అవకాశం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేసారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్పొరేటర్ ఐఎస్‌సదన్‌లోని శ్రీబాలజీనగర్ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఎస్‌సదన్‌లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు పూర్తి చేసి ఐఎస్‌సదన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, రేణుకా ముదిరాజ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అశోక్‌రెడ్డి, యాదయ్య, పర్వత్‌రెడ్డి, శ్రీమాన్, కైలాష్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో) టమోటా 63, వంకాయ 35, బెండ 38, పచ్చిమిర్చి 85, కాకర 45, బీర 40, కాలిఫ్లవర్ 28, క్యాబేజీ 15, క్యారెట్ 45. దొండ 28.

ఎమర్జెన్సీతో దేశాన్ని చీకటి రాజ్యంలోకి నెట్టారు

మన్సూరాబాద్: అత్యవసర పరిస్థితి విధించి దేశాన్ని చీకటి రాజ్యంలోకి నెట్టి రాక్షస పాలనను కాంగ్రెస్ పార్టీ సాగించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన రోజును పురస్కరించుకుని ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న నూకల ఆదినారాయణరెడ్డిని ఎల్‌బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో అత్యవసర పరిస్థితి విధించి నేటికి 48 ఎళ్లు కావస్తుందన్నారు. అధికారం నిలబెట్టుకోవటం కోసం కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించి పౌరహక్కుల్ని, పత్రికాస్వేచ్ఛను కాలరాచిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు నాంపల్లి రామేశ్వర్, గుండే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

నాగోలు: రోడ్డు పనులలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా లెవెల్స్ సరిచూసుకోవాలనీ, వర్షపు నీరు ఆగకుండా స్లోప్ చూసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కొత్తపేట డివిజన్ శివ శంకర్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులు పూర్తి చేయాలని పనులలో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే స్తంభాలను మార్చాలని విద్యుత్ అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు డి క్రిష్ణ, రమేష్ చారి, నాగేశ్వర్ రావు, నాయకులు కిరణ్ గౌడ్, శివ చారి, కొత్త తిరుమల తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల మాటలు నమ్మొద్దు

హస్తినాపురం: వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు మరో మారు హామీలు ఇచ్చి మోసం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తుందని వారి మాటలు ప్రజలు నమ్మవద్దని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బీజేపి కార్యక్రమం ఎల్‌బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం కేసీఆర్ కొత్త కొత్త పథకాలతో మరో మారు ప్రజలను మోసం చే స్తారని వారి మాటలు ప్రజలు నమ్మవద్దని అన్నారు. హస్తినాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, ఎరుకల మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న 20 మంది అరెస్ట్

హస్తినాపురం: పార్కులలో, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఇరవై మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్, బీఎన్‌రెడ్డినగర్, తుర్కయంజాల్, ఇంజాపూర్, తదితర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పగిళ్ల కాశీనాథ్, రవిశేఖర్, విజయ్, మహ్మద్ రశీద్, కంభం చందు తదితరులతోపాటు ఇద్దరు మైనర్లను వనస్థలిపురం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.

అసంపూర్తి నాలాలోకి చేరిన వరదనీరు...

అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వం



బాక్స్‌టైప్ నాలాల్లోకి భారీగా చేరిన వరదనీరు, మురుగునీరు

మన్సూరాబాద్: నత్తనడకన నడుస్తున్న బాక్స్‌టైప్ నాలా పనులతో చిన్నపాటి వర్షానికే వరదనీరు నాలాల్లోకి చేరి ఇళ్లను ముంచెత్తుతోంది. ఉన్నతాధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ పనులను నెమ్మదిగా చేపడుతుండంతో వేసవిలో పూర్తికావాల్సిన పనులు వర్షాకాలంలో కూడా నడుస్తుండటంతో చిన్నపాటి వర్షానికే కాలనీవాసులు అనేక అవస్థలు పడుతున్నారు. మన్సూరాబాద్ డివిజన్ సరస్వతినగర్‌కాలనీలో చేపడుతున్న బాక్స్‌టైప్ నాలాల్లోకి శనివారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీటితో పాటు మురుగునీఉ కలవటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. అసంపూర్తి పనులతో సరస్వతినగర్‌కాలనీవాసులు డ్రైనేజీ మురుగులోనే జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది.

నెలరోజుల్లో బాక్స్‌టైప్ నాలాను పూర్తిచేస్తాం

హయత్‌నగర్ సర్కిల్ ఈఈ రమేష్‌కుమార్ ఆదివారం సరస్వతినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ కాలనీలో చేపడుతున్న బాక్స్‌టైప్ నాలా పనులను నెలరోజుల్లో పూర్తిచేస్తామని, ఆందోళన చెందవద్దని హయత్ నగర్ సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రమేష్‌కుమార్ కాలనీవాసులకు భరోసా ఇచ్చారు.

అసంపూర్తి పనులతో ఇండ్లు ఖాళీ చేసే పరిస్థితి

కాలనీవాసుల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఆదివారం ఉదయం సరస్వతినగర్‌కాలనీలో పర్యటించారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కాలనీవాసులు ఇళ్లను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చైతన్యపురి: చైతన్యపురి మున్సిపల్ కాలనీలో ఇంటి పైకప్పు పెచ్చులూడి మీదపడి గాయాల పాలైన అంగోత్ రంగయ్య నాయక్ కుటుంబానికి స్థానిక బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ ఆర్థిక సహాయం అందజేశారు. జరిగిన సంఘటనపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఎమ్మెల్యే సూచనల మేరకు బాదిత కుటుంబానికి రూ. 5 వేలు తన వంతు సహాయంగా అందజేసినట్లు మహేష్‌యాదవ్ తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద సహాయం చేయించనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగలక్ష్మి, సంపత్‌కుమార్, వీర పవన్ నాయుడు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి నివాళి

లింగోజిగూడ: తెలంగాణ ఉద్యమ కారుడు కుక్కనూరి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావులు నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొని ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి పాడెను మోశారు.